


నేటి నుంచి రాష్ట్రస్థాయి విలువిద్య క్రీడా పోటీలు

పార్వతీపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం జోగింపేట అంబేడ్కర్ గురుకులం ప్రాంగణంలో నేటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి విలు విద్య క్రీడా పోటీలు జరగనున్నాయని స్కూల్ గేమ్స్ జిల్లా ప్రెసిడెంట్, డీఈవో ఎస్.తిరుపతినాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం జోగింపేటలో పీడీలు, పీఈటీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ 14, 17, 19 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నట్లు చెప్పారు. ఇందులో ప్రతిభ చూపిన వారు జాతీయస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

దేదీప్యమానంగా..



- సాలూరులో అఖండ జ్యోతి
- అంతటా కార్తీక సందడి

సాలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో సాలూరు శివాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని ముక్కంటిని దర్శించుకున్నారు. ఏటాలానే పట్టణంలో పంచముఖేశ్వర ఆలయంలో శాస్త్రోక్త పూజలతో అఖండ జ్యోతిని వెలిగించారు. నెల రోజుల పాటు నిర్విరామంగా వెలగనున్న ఈ అఖండ జ్యోతి.. భక్తుల పూజలు అందుకోనుంది. కాగా సాయంత్రం భక్తజనం ఆలయంలో ఆకాశదీపం వెలిగించారు. ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం లలిత సహస్రనామార్చన కార్యక్రమం నిర్వహించారు.

- పూర్తి వివరాలు 6వ పేజీలో..



సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో అఖండ జ్యోతి వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



భామిని ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇలా..

- తప్పుల తడకగా ఆధార్ వివరాలు
- పేర్లు, పుట్టిన తేదీల్లో తేడాలు
- సరి చేసుకునేందుకు అవస్థలు
- విద్యార్థులు, తల్లిదండ్రులకు తప్పని పాట్లు

అపార్ కష్టాలు



భామిని, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) సంఖ్యను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నమోదుకు ఆధార్ కార్డులో వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవంగా ఆధార్‌లో ఉన్న సమాచారం మేరకే అపార్ కార్డులు జారీ అవుతాయి. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకగా ఉండడం, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి సమస్యలను తలెత్తుతున్నాయి. మరోవైపు ఆధార్‌ను సరిచేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. అపార్ నమోదుకు గడువు ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతుండడంతో పనులన్నీ మానుకుని సచివాలయం, మీసేవ, ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. మరోవైపు విద్యార్థులు, వారి తల్లింద్రులకు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

అన్ని పనులు మానుకుని..

కొంతమంది విద్యార్థుల పుట్టిన తేదీ, పేర్లు పాఠశాలల రికార్డుల్లో ఒకలా.. ఆధార్ కార్డులో మరోలా ఉన్నాయి. ఆధార్ కార్డులో కేవలం సంవత్సరం మాత్రమే ఉంది. ఇది మార్చాలంటే.. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారు చాలా తక్కువ. కాగా ప్రస్తుతం ఆధార్‌లో పుట్టిన తేదీ అప్‌డేట్ కోసం.. లాయర్ వద్ద నోటరీ పొందాలి. పంచాయతీ కార్యాలయాల్లో నాన్ ట్రేస్ సర్టిఫికెట్ తీసుకుని.. సచివాలయం, రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. వాటిని తహసీల్దార్, ఆర్‌డీవో పరిశీలించిన తర్వాత జనన ధ్రువీకరణ పత్రం జారీ అవుతుంది. దీనిని తీసుకుని ఆధార్ అప్‌డేట్ చేయడానికి సుమారు 15 రోజుల నుంచి 30 రోజులు పడుతుంది. అప్పటికి అపార్ నమోదు గడువు కూడా ముగిస్తుందనే టెన్షన్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో 1.39 లక్షల మంది విద్యార్థులు ఉండగా ఇంకా 80వేల మంది వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కాగా ఈ ప్రక్రియ త్వరగా...

- మిగతా 8వ పేజీలో..



కోడ్ కూసింది..



- స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్
- జిల్లాలో కోడ్ అమలు
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు బ్రేక్

పార్వతీపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నగారా మోగింది. విజయనగరం జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు బ్రేక్ పడింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేశారు. వాటికి సంబంధించి కొద్దిరోజులుగా ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధుల శంకుస్థాపన కార్యక్రమాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి లోపు ఆయా పనులను పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే నిధుల వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంది. అయితే కోడ్ అమలులోకి రావడంతో పనుల పూర్తి, నిధుల వ్యయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరు జిల్లాల్లో ఓటర్లు..



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరికీ ఓటు హక్కు ఉంది. వీరంతా శాసన మండలి సభ్యుడిని ఎన్నుకుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో వుంది. ఈరెండు జిల్లాల్లోనూ కూటమికు చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. కానీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల్లో అత్యధికంగా వైసీపీకు చెందిన వారు ఉన్నారు. దీంతో కూటమికి, ప్రతిపక్ష వైసీపీకి కూడా ఈ స్థానాన్ని దక్కించుకోవడం ప్రతిష్ఠగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ స్థానాన్ని శృంగవరపుకోట మండలం బొడ్డవర గ్రామానికి చెందిన ఇందుకూరి రఘురాజుకు కట్టబెట్టిన వైసీపీ పార్టీయే తిరిగి అనర్హత వేటు పడేందుకు కారణమైంది. ఇతని భార్య ఇందుకూరి సుధారాజు సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీలో చేరారని, వివిధ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులతో కలసి రఘురాజు పాల్గొన్నారని, వైసీపీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారన్న అభియో గాలను మోపారు. పార్టీ విప్ పాలవలస విక్రాంత్ చేసిన ఫిర్యాదు మేరకు మండలి చైర్మన్ మోసన్‌రాజు అనర్హత వేటు వేశారు. వాస్తవానికి రఘురాజు ఎమ్మెల్సీ పదవి గడువు 2027 డిసెంబర్ ఒకటి వరకు ఉంది. ఉప ఎన్నిక కావడంతో పదవీ కాలం మూడేళ్లే ఉంటుంది. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో గెలవడం కూటమి, వైసీపీకి ప్రతిష్మాత్మకం.

అమలులోకి ఎన్నికల కోడ్: కలెక్టర్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈనెల 4న నోటిఫికేషన్ విడుదలవుతుండగా, 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని చెప్పారు. 12న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణ, 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబరు 1న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించాలన్నారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు నూతన విధానాలు ప్రకటించరాదని, ఎన్నికల కార్యక్రమాలతో జత చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, అభ్యర్థుల ఖర్చును పరిశీలించడానికి జిల్లాలో వీడియో సర్వేలెన్స్, ఇతర బృందాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కోడ్ కారణంగా సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

శిశు మరణాల నివారణకు చర్యలు

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

పార్వతీపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి ఆదేశించారు. శనివారం ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా ఉపస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో సంభవించిన శిశు మరణాలపై సమీక్షించారు. మర్రిపాడు, మాదలింగి మొండెంఖల్లు, నీలకంఠాపురం, దోనుబాయి, గరుగుబిల్లి, మామిడిపల్లి, శంబర, అరసాడ, తోణం, భామిని తదితర పీహెచ్‌సీల పరిధిలో 13 శిశు మరణాల కారణాలపై ఆరా తీశారు. బిడ్డ జన్మించినప్పటి నుంచి దశల వారీగా వైద్య సిబ్బంది గృహ సందర్శనలు చేయాలని సూచించారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య అయినా వెంటనే చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. పిల్లల్లో శ్వాస సంబంధిత వ్యాధులను గుర్తించాలన్నారు. శిశు మరణాల నివారణకు సమష్టి కృషి చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఐవో నారాయణరావు, ప్రోగ్రాం అధికారులు జగన్మోహన్‌రావు, రఘుకుమార్, వినోద్‌కుమార్, పిల్లల వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.



శిశు మరణాలపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

గజరాజుల బీభత్సం

- ఆటో, కాంక్రీట్ మిల్లర్‌ను నెట్టేసిన వైనం
- భయంతో పరుగులు తీసిన ప్రజలు

పార్వతీపురం రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం పెద్దబొండపల్లి తదితర ప్రాంతాల్లో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. జనావాసాల్లో సంచరించడమే కాకుండా పంట, ఆస్తి నష్టాలను కలిగి స్తున్నాయి. కొద్ది రోజుల కిందట వాటి దాడిలో ఓ వ్యక్తి మరణించిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం గదబవలస ప్రధాన రహదారిపై ఏనుగులు దర్శనమిచ్చాయి. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులు చెరోవైపు పరుగులు తీశారు. ఇదే సమయంలో గజరాజులు ఆటోతో పాటు దాని వెనుకున్న కాంక్రీట్ మిల్లర్‌ను ఓ వైపునకు నెట్టేశాయి. దీంతో రోడ్డు పక్కకు అవి బోల్తా పడ్డాయి. అయితే ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు , ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఏదేమైనా ప్రధాన రహదారిలో ఇలా గజరాజులు సంచరించి.. వాహనాలపై దాడి చేయడంపై ఆ ప్రాంతవాసులు తీవ్ర భయాంలోళన చెందుతున్నారు. తక్షణమే అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



ఏనుగుల దాడిలో బోల్తా పడిన ఆటో, కాంక్రీట్ మిల్లర్

వీడీవీకేల ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాస్తవ

పార్వతీపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ పరిధిలో వీడీవీకేల ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తుల బజార్లు, వీడీవీకేలు, మల్టీపర్పస్ సెంటర్లు, గోకులాలను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనుల జీవనోపాధుల మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక బజార్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఇల్లాలే.. జీవనజ్యోతి!

- ఆదివారమూ మహిళా ఉద్యోగులకు పనులే..
- సెలవే తెలియని వైనం
- నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

6లో




6 నుంచి కంటి వెలుగు పరీక్షలు

పార్వతీపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి కంటి వెలుగు కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శని వారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. 'కంటి వెలుగు' కింద సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పాచిపెంట, జియ్యమ్మవలస, కొమరాడ పీహెచ్‌సీల పరిధిలోని సచివాలయాల్లో రెండు రోజుల పాటు వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు దృష్టి లోపం నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. దీనిపై గ్రామాల్లో ముందస్తుగా చాటింపు వేయించాలని సూచించారు. 15 ఏళ్లు దాటిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయాలని ఆదేశించారు. జిల్లాలో 516 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదు పాయాల కల్పనకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. విద్యుత్, పెయింటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర పనులను ఈ నెల 14 లోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నైపుణ్య గణనను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. 15 నుంచి 59 ఏళ్ల లోపు వారి పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఇందుకు కోసం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సరైన శిక్షణ ఇచ్చి ప్రతి ఇంటిని సందర్శించేలా చేయాలన్నారు. ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండే ప్రాంతా లను ముందుగా ఎంచుకొని, వాటి పరిధిలో గణనను చేపట్టాలని సూచించారు. యువతను అవగాహన కల్పించి రక్తదానానికి ముందుకు వచ్చేలా చూడాలన్నారు. 11 మండలాల్లో డిజిటల్ లైబ్రరీలకు సామగ్రిని పంపిణీ చేశామని తెలిపారు.

శివ పూజకు వేళాయె!



అడ్డాపుశీలలోని మహానంది



ఎస్.కోటలోని దారగంగమ్మ లోయ..

కార్తీకమాసం... ఏడాదిలో అత్యంత విశిష్టమైనదిగా భక్తులు భావించే మాసం. ఈ నెలలో భక్తులతో శివాలయాలు కొత్త శోభను సంతరించుకుంటాయి. ప్రత్యేకంగా కార్తీక సోమవారాలలో శివ క్షేత్రాలకు అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. జిల్లాలో పుణ్యగిరి, గుంప, సంగమేశ్వర తదితర ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని శైవ క్షేత్రాలు... వాటి విశిష్టతను తెలుసుకుందాం.

- శైవాలయాల్లో భక్తుల సందడి
- కార్తీక మాస పూజలు ప్రారంభం

కోర్కెలు తీర్చే కాశీవిశ్వేశ్వరుడు..

పార్వతీపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడ్డాపుశీలలోని కాశీవిశ్వేశ్వరుని దర్శనం చేసుకుంటే కాశీలోని విశ్వేశ్వరుడిని దర్శనం చేసుకున్నట్టేనని ఈ ప్రాంత భక్తులకు అపారమైన నమ్మకం. కోరికలు తీర్చే వాడిగా కాశీవిశ్వేశ్వరుడికి ఈ ప్రాంతంలో పూర్వం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయంలో ఉన్న శివలింగానికి పూర్వం కాశీ గంగను తెచ్చి జలాభిషేకం చేసేవారని చెప్పుకుంటారు. కార్తీక మాసంలో ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. పాలకొండ, జియ్యమ్మవలస, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు.

పుణ్యగిరి... ఉత్తర కాశీగా ప్రసిద్ధి

శృంగవరపుకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరిలో శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి కొలువై ఉన్నాడు. దీన్ని ఉత్తర కాశీగా పిలుస్తారు. పచ్చని కొండల పైన ఆలయం ఉండడంతో మెట్ల మార్గంలో భక్తులు చేరుకోవలసి ఉంటుంది. ఈ మహాశివుని దర్శిం చుకునే ముందు శ్రీదారగంగమ్మ లోయలో జాలువారే నీటిలో స్నానమా చరించడం. ఎక్కడి నుంచి వస్తుందో తెలియని పుట్టదార వద్ద పారు తున్న గంగలో తల తడుపుకోవడం వంటి ప్రత్యేకతలు ఈ క్షేత్రం సొంతం. కార్తీక మాసంలో సోమవారాలతో పాటు మిగిలిన రోజులు ఈ ఆలయానికి భక్తులు వస్తారు. ఎస్.కోట దేవిబొమ్మ కూడలి నుంచి ఆ అలయ మెట్ల మార్గానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. సొంత వాహనాలతో చేరుకోవాల్సిందే. ఎక్కువ మంది భక్తులు ఉంటే స్థాని కంగా ఉన్న ఆటోల ద్వారా చేరుకోవచ్చు. విశాఖ, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఎస్.కోటకు ఆర్టీసీ బస్సులు ఉన్నాయి.

దిబ్బేశ్వర ఆలయం..



సారిపల్లి దిబ్బేశ్వర ఆలయం

నెల్లిమర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరానికి 9 కిలోమీటర్ల దూరంలో.. నెల్లిమర్ల మండల కేంద్రానికి 6కిలోమీటర్ల దూరంలో సారిపల్లి గ్రామానికి సమీపంలో చంపావతి నది తీరాన దిబ్బేశ్వర ఆలయం ఉంది. ఇది ఏకరాతితో నిర్మించిన ఆలయం. 10వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారుల కథనం. ఈ అలయం ప్రస్తుతం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉంది. విజయనగరం, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి ప్రాంతాల భక్తులు కార్తీక మాసంలో ఈ ఆలయానికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

త్రివేణీ సంగమ క్షేత్రం..



సంగమేశ్వర ఆలయం

వంగర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగాంలో వెలసిన సంగమేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కార్తీక మాసంలో భక్తులు భారీగా వచ్చి ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రీకృష్ణుడి సోదరుడైన బలరాముడు ప్రతిష్ఠించిన పంచఆలయాల్లో ఒకటిగా దీనిని చెబుతారు. ఈ ఆలయం నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు కలిసే ప్రాంతలో ఉండడం విశేషం. కార్తీక మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఆలయంలో భక్తులు తండోపతండాలు గా వచ్చి పూజలు చేస్తారు. త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. ప్రతి సోమవారం దేవాలయ కమిటీ చైర్మెన్ బీఆనందరావు ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇక్కడికి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

800 ఏళ్ల నగరేశ్వర స్వామి..



నగరేశ్వర స్వామి

బొబ్బిలి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలోని నగరేశ్వర స్వామి దేవాలయానికి దాదాపు 800 సంవత్సరాల చరిత్ర ఉంది. వేగావతి నదీ తీరాన ఈ ఆలయం వెలసింది. ఇక్కడ నాలుగు అడుగుల ఎత్తు... నాలుగు అడుగుల వెడల్పు కలిగిన పెద్ద శివలింగం మనకు దర్శనమిస్తుంది. పాల్తేరు, బొబ్బిలి, రంగరాయపురం, తదితర గ్రామాల నుంచి ప్రతి సోమవారం, పౌర్ణమి, ఏకాదశి రోజులలో, కార్తీక మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు.

శ్రీరామలింగేశ్వర ఆలయం..



గజపతినగరంలోని శ్రీరామలింగేశ్వర ఆలయం

గజపతినగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామ గ్రూపు దేవాలయా ల్లో గల రామ లింగేశ్వర ఆలయంలో ఐదు శతాబ్దాలుగా భక్తులు పూజలు చేస్తున్నారు. ఇక్కడి శివుడు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తుల నమ్మకం. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఏటా కార్తీక మాసం అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో శనివారం శ్రీరామలింగేశ్వర ఆలయంతో పాటు బజార్ సెంటర్‌లో గల శ్రీ వేంకటేశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు.

కార్తీక పూజలకు సిద్ధమైన గుంప..



గుంప సోమేశ్వర స్వామి

కొమరాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్వాపర యుగంలో బలరాముడు ప్రతిష్ఠించిన పంచ లింగాలలో గుంప సోమేశ్వర స్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయంలో కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలసిన ఈ ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అనేకమంది భక్తులు జంఝావతి, నాగావళి నదులలో స్నానం ఆచరించి సోమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఈ ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే కొమరాడ మండలం కోటిపాం కాలనీ నుంచి రెండు కిలో మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు గుండా ప్రయాణం చేయవలసి ఉంటుంది. కార్తీకమాసంలో గుంప సోమేశ్వర స్వామి ఆలయంలో ఎక్కువగా రుద్రాభిషేకాలు, ఏకవార అభిషేకాలు జరుగుతుంటాయని అర్చకులు తెలిపారు.

మాధవ లింగేశ్వర ఆలయం..



మాధవ లింగేశ్వర మల్లికార్జున ఆలయంలో భక్తులు

బొండపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గెద్దపేట గ్రామంలో ఉన్న శ్రీమాధవ లింగేశ్వర మల్లికార్జునస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. 300 ఏళ్ల క్రితం స్వయంభూగా వెలసిన ఈ శివలింగం మనోహరంగా భక్తులకు దర్శనమిస్తుంది. సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత ప్రాచీన మర్రిచెట్టు కింద శివకేశవుల ఆలయం నిర్మించడంతో కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం దాతల సహకారంతో అన్నసమారాధన చేస్తుంటారు.


జమీందారులు నిర్మించిన ఆలయం



కురుపాం కొండ మీద ఉన్న ఆలయం

కురుపాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కురుపాంలోని పురాతన శివాలయంలో పూజల సందడి మొదలైంది. ఈ ప్రాంతంలో పురాతనమైన కోవెలగా దీనికి పేరుంది. కురుపాం జమీందారులలో సీనియర్ వీరభద్రరాజు 1906లో దీనిని నిర్మించినట్టు చెబుతారు. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో గల హుకుంపేట వద్ద గల కొండపై వెలసిన ఈ శివాలయానికి ఏటా కార్తీక మాసంలో వేలాదిగా భక్తులు తరలి వస్తారు. ఏటా నవంబరు నెలలో సూర్యకిరణాలు నేరుగా శివలింగాన్ని తాకడం ఇక్కడి ప్రత్యేకత.

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పారమ్మతల్లి..



పారమ్మ కొండ

పాచిపెంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పారమ్మతల్లి క్షేత్రం కార్తీక మాసంలో భక్తులతో కళకళలాడుతుంది. సాలూరు పట్టణానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో పాచిపెంట మండలం పెదచీపురు వలస గ్రామ సమీపంలో ఉన్న పారమ్మ తల్లి క్షేత్రం ప్రసిద్ధి చెందింది. 2,500 మెట్లు ఎక్కి పారమ్మ తల్లిని భక్తులు దర్శించుకుంటారు. ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి పారమ్మ కొండ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇదిలాఉండగా పాచిపెంట మండల కేంద్రంలో శ్రీమల్లికార్జున స్వామి ఆలయాన్ని అప్పట్లో దేవతలు నిర్మించారని చెబుతారు.

పంచముఖేశ్వర ఆలయం..



సాలూరు పంచముఖేశ్వర స్వామి ఆలయం

సాలూరు రూరల్/సాలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని పంచముఖేశ్వర ఆలయం దాదాపు 500 ఏళ్ల క్రితం నిర్మించినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. ఒక యోగి ఐదు వందల ఏళ్ల క్రితం కాశీ నుంచి తపోశక్తి ద్వారా పంచముఖేశ్వర శివలింగాన్ని తెప్పించినట్టు ప్రచారంలో ఉంది. యోగి తపోశక్తి కారణంగా ఈ శివాలయం పరిసర ప్రాంతంలో పాములు మనుషులకు కాటు వేయవనే మరో నమ్మకం ఉంది. పంచముఖేశ్వర ఆలయంలో ప్రస్తుతం సుబ్బ గురువు ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాలూరు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మలకొండ గుహాలయంలో శివలింగం, సాలూరు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో గల మంచాడవలస గుహలో గోకర్ణేశ్వరస్వామి కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు.

మంచు దుప్పట్లో..





కార్తీకం మాసం వస్తూనే శీతాకాలం ప్రారంభమైందని చెప్పొచ్చు. ఇందుకు సూచికగా జిల్లాలో అనేక ప్రాంతాల్లో తెలవారుతూనే మంచు దుప్పట్లు కమ్ముకుంటున్నాయి. కొద్ది రోజులుగా ఎండలతో అవస్థలు పడుతున్న జిల్లా వాసులకు రెండు రోజులుగా సాయంత్రం కాగానే చిన్నపాటి చలి ప్రారంభం కావడంతో ఉపశమనం లభిస్తోంది. అలాగే ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లెల్లోని పంట పొలాలు, రోడ్లు, చెరువులపై మంచు దుప్పట్లు కప్పుకుని శీతాకాలం ఆరంభాన్ని సూచిస్తున్నాయి.

-విజయనగరం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి)

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వనున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర డీఎస్సీ అభ్యర్థులు సీఎం చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని కోట జంక్షన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాలకు వెయ్యి పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఏ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పోస్టులను ఇదే డీఎస్సీలో భర్తీ చేసి... రాష్ట్రంలో ఉన్న 74,000 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. టెట్ నిర్వహణలో తలెత్తిన సమస్యలను పరిష్కరించడానికి మరో టెట్ నిర్వహించి డీఎస్సీకి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 2025 జూన్ నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర డీఎస్సీ నిరుద్యోగ సమితి సభ్యులు రామ్ శ్రీ, చలపతి, బాలకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లాలే.. జీవనజ్యోతి!



- ఆదివారమూ మహిళా ఉద్యోగులకు పనులే
- సెలవే తెలియని వైనం

ఏ ఇంటికైనా ఇల్లాలే కీలకం. ఇంటిని... కుటుంబాన్ని నడిపేది గృహిణులే. ఇంటికే పరిమితమైన వారి వరకూ కొంత ఫర్వాలేదు. కానీ ఉద్యోగం చేసే మహిళలకైతే మరీ కష్టం. పురుషులకు ఆదివారం సెలవు దొరుకుతుంది. కానీ ఉద్యోగం చేసే మహిళలకు ఆదివారం సెలవు ఉండదు సరికదా...కొన్ని ఇళ్లలో అదనపు పనుల భారం మోయాల్సి వస్తోంది. ఆదివారం 'ప్రపంచ గృహిణుల దినోత్సవం' సందర్భంగా వివిధ వర్గాల మహిళలు ఏమంటున్నారో చూద్దాం.

నిరంతరమూ విధులే..

శృంగవరపుకోట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):

● వేపాడ మండలానికి చెందిన ఓ మహిళ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు విధుల్లో ఉండాలి. ఒక్కోసారి ఆదివారం సెలవైనప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో విధుల్లో ఉండాల్సిందే. ప్రతి రోజూ తెల్లవారు జామున నిద్ర లేస్తాను. వైద్య ఆరోగ్య శాఖలోని యాప్‌లలో చేయాల్సిన పనిని ఉదయానికి పూర్తి చేసుకోవాలి. లేదంటే నెట్ సరిగా పనిచేయదు. నాతో పాటు భర్త, అత్త ఉన్నారు. ప్రస్తుతానికి పిల్లలిద్దరూ పైచదువుల కోసం పట్టణాల్లో ఉన్నారు. ఇంటి పనులు పూర్తి చేసుకునే సరికి ఉదయం 8.30 గంటలు అవుతుంది. తొమ్మిది గంటలకు విధులకు హాజరవుతారు. తిరిగి ఇంటికి చేరుకోనేటప్పటికి సాయంత్రం 5.30 నుంచి ఆరు గంటలు అవుతుంది. ఆ తర్వాత ఇంటి పనులు, వంట పనులు చేసుకునే సరికి సరిపోతుంది. అనంతరం విధులకు సంబంధించిన ఆన్‌లైన్ వర్కు చేయడంతో పాటు ఉన్నతాధికారుల ఫోన్‌లకు సమాధానం ఇస్తూనే మరికొన్ని పనులు ఉంటాయి. ఇవన్నీ పూర్తి చేసుకుని రాత్రి 10 నుంచి 11 గంటల సమయంలో నిద్రకు ఉపక్రమించాలి. ఆదివారం వచ్చిందంటే ఉద్యోగానికి సెలవు. ఇంట్లో పనికి మాత్రం సెలవుండదు. ఇంటి పని, వంటపనితో పాటు వారం రోజుల నుంచి పేరుకుపోయిన దుస్తులు ఉతికేసరికి ఆ రోజు కరిగిపోతుంది. భర్తకు ప్రైవేట్ ఉద్యోగం కావడంతో వారెప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లాలి. పనిలో సాయం చేయాలని ప్రయత్నించినా కుదరదు. అత్త వృదురాలు. తన పని తాను చేసుకొనేందుకే కష్టాలు పడుతుంది. ఆదివారమైనా... సోమవారమైనా పనికి అలవాటు పడిపోయారు. ఒక్కోసారి ఆరోగ్యం సహకరించని సమయంలో మాత్రం బాధగా ఉంటుందని, పిల్లల చదువు, కుటుంబ జీవనం సాగాలంటే ఇలా కష్టపడక తప్పదని ఆమె చెబుతోంది.

● 'నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. నేనూ ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నాను. మాకు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం ఒకరు ప్రాథమిక, మరొకరు ప్రాథమికోన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇద్దరినీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉంచడం వల్ల వారికి తయారు చేసి పాఠశాలకు పంపించే శ్రమ కొంతవరకు తప్పింది. లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలో ఉంటున్నాం. నేను 60 కిలోమీటర్లు దూరంలో పని చేస్తున్నాను. అక్కడే ఉండి నేను ఉద్యోగం చేసినా... నాభర్త ఈ 60 కిలో మీటర్లు తిరగాల్సి ఉంటుంది. దీనికి తోడు నా భర్త తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు మామీదే ఆధారపడి ఉన్నారు. అందువల్ల నేనే రాకపోకలు సాగిస్తున్నాను. తెల్లవారు జాము నాలుగు గంటలకు నిద్రలేస్తాను. వంట, పూజ ఉదయం ఆరు గంటలలోపు పూర్తిచేస్తాను. నాభర్త పది కిలో మీటర్లు దూరంలో ఉన్న ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు దిగబెడతారు. అక్కడ బస్సెక్కి కళాశాల తెరిచే సమయానికి చేరుకుంటాను. సాయంత్రం 5 గంటలకు కళాశాల వదిలిన తర్వాత అక్కడ బయలు దేరి ఇంటికి వచ్చేటప్పటికి రాత్రి 8 నుంచి 9 గంటలు అవుతుంది. త్వరత్వరగా స్నానం, వంట పూర్తి చేస్తాను .ఉదయం, రాత్రి వంట సమయంలో నా భర్త తనకు చేతనైనంత సాయం చేస్తారు. ఆదివారం ఇద్దరం చెరో పని చేసుకోవాల్సి వస్తోంది'

-ఎస్.కోట నియోజకవర్గంలోని ఓ మహిళ గాథ ఇది

● 'మాది ఎస్.కోట. నా భర్త విద్యాశాఖలో నాన్ టీచింగ్ స్టాఫ్. ఆయన డ్యూటీకి వెళ్లేందుకు ఉదయం 8 గంటలకు క్యారేజీ సిద్ధం చేయాలి. అందువల్ల నేను ఉదయం 5 గంటలకు నిద్ర లేస్తాను. ఇంటిని శుభ్రం చేసి, వంటి పనులు చేస్తూనే భర్త, అత్త, మామలకు టీలు, కాఫీలు అందించాలి. సమయానికి టిఫిన్ (అల్పాహారం) ఇవ్వాలి. నా భర్త విధులకు వెళ్లిన తర్వాత మిగతా ఇంటి పనులు పూర్తి చేసుకుంటాను. దుస్తులు ఉతకడం, ఇతర పనులు పూర్తి చేసేసరికి మధ్యాహ్న భోజన సమయం అవుతుంది. అత్తమామలకు, పిల్లలకు భోజనం పెట్టేసరికి సరిపోతుంది. చిన్న చిన్న పనులు చేసేలోగా సాయంత్రం అయిపోతుంది. డ్యూటీ నుంచి వచ్చిన భర్తకు టీ, స్నానానికి అవసరమైనవి అందించి ఇంటిలోకి వచ్చి తిరిగి రాత్రి వంటకు ఉపక్రమిస్తాను. భోజనాలు చేసిన తర్వాత వాటన్నిటిని శుభ్రపరుచుకొని నిద్రకు ఉపక్రమించే సరికి రాత్రి పది దాటుతుంది. ఒక్కో రోజు ఈ పనులు మధ్యలోనే వదిలేసి నిత్యావసర సరుకులు, కూరగాయలు వంటివి బజారుకు వెళ్లి తెచ్చుకోవాలి. ఇలాంటి సమయంలో కొద్దిసేపు కూడా విశ్రాంతి ఉండదు. వారం రోజులు డ్యూటీ చేసిన భర్త నోటికి రుచికరమైన వంటలు వండాలన్న తపన ఆదివారం మరింత పని పెంచుతుంది'

-ఇది మరో మహిళ దైనందిన జీవితం

● ఉద్యోగం చేసినా చేయకపోయిన మహిళలకు ఆదివారం సెలవన్నది ఉట్టిమాటే. అయితే ఇప్పుడిప్పుడే ఇంటిపనిలో మగవారి సహకారం అందుతోంది. చేరోపని చేసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం అత్యధిక శాతం భార్యాభర్తలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మగవారు కూడా ఇంటి పని బాధ్యతలను గుర్తిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం మహిళలే అన్ని పనులు చేసుకోవాలన్న నియమం ఇంకా కొనసాగుతోంది.

● ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉపాధ్యాయులు వంట, ఇంటి పనుల్లో సాయం చేసేవారిలో ముందున్నారు. 'ఆంధ్రజ్యోతి' పలకరించిన 50 మందిలో అత్యధిక శాతం మంది వారే. వారి తర్వాత స్థానంలో వ్యవసాయ కూలీలు ఉన్నారు. చేరోపని చేసుకొంటే తొందరగా ఇద్దరం కలసి కూలీ పనులకు పోయేందుకు అవకాశం ఉంటుందని బదులిచ్చారు. ఇద్దరూ ఉద్యోగాలు చేసిన వారైతే వంట, ఇంటి పనివారు పెట్టే తిండే గతంటూ చమత్కరించారు.

కొంచెం సాయం.. కొంచెం దూరం



బైకుపై స్కూలుకు వెళుతున్న సత్యనారాయణ, శ్రీవిద్య దంపతులు

బొబ్బిలి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'ప్రతి రోజూ ఇంటి పనుల్లో మీ భార్యకు సహకరిస్తున్నారా?' ...ఇదే ప్రశ్నతో ఓ 50 మందిని పలకరిస్తే... వారి నుంచి మిశ్రమ సమాధానాలు వచ్చాయి. భార్యకు సాయం చేస్తున్నామని 60 శాతానికి పైగా బదులివ్వగా... 40 శాతం మంది 'లేదు' అని చెబుతున్నారు. ఏ తరహా సాయం చేస్తున్నారో వారి మాటల్లోనే... బొబ్బిలి పట్టణ పరిధిలోని నాయుడు కాలనీలో నివాసం ఉంటున్న గంట సత్యనారాయణ, ఆయన సతీమణి బొత్స శ్రీవిద్యలు తెర్లాం మండలం నందబలగలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. సత్యనారాయణ హైస్కూలులో స్కూలు అసిస్టెంట్. శ్రీవిద్య ఎంపీపీ స్కూలులో ఉపాధ్యాయిని. శ్రీదేవి ఏమంటున్నారంటే... 'మేమిద్దరం ప్రభుత్వ ఉపాధ్యాయులం... రోజూ బైకుపై స్కూలుకు బయలుదేరి వెళతాం. రోజువారీగా షటిల్ ఆడేందుకు... వ్యాయామం కోసం వెళ్లి వచ్చిన తరువాత తయారై వంట చేసేందుకు అవసరమైన పదార్థాలను సిద్ధం చేసి నా భార్యకు అందిస్తాను. భోజనం క్యారియర్లు సర్దడం, బ్యాగ్‌లు సర్దడం వంటివి చేస్తాం. కాఫీ లేదా టీ తయారు చేసి ఇంట్లో పెద్దవారికి అందజేస్తుంది. ఇంటి పనులు చూసేందుకు పనిమనిషిని నియమించుకున్నాం. అయినా చాలా పనులు స్వయంగా చేసుకోవాల్సినవి ఉంటాయి. మాకు ఇద్దరు ఆడపిల్లలు. వారు చిన్నవాళ్లుగా ఉన్నప్పుడు స్నానాలు చేయించి... ముస్తాబు చేసి స్కూలుకు దిగబెట్టే పనులు చేసేవాడిని. వాళ్ల పెద్దవాళ్లవడంతో కాలేజీ హాస్టళ్లలో ఉంటున్నారు. వారి కోసం ఇక ఏమీ చేయాల్సిన పనిలేదు. ఇంట్లో వయో వృద్ధులైన తల్లిదండ్రులను సాకాల్సి ఉంది. వారి అవసరాలను తీర్చుతున్నామ'ని సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఆడవారికి ముమ్మాటికీ సెలవు లేదు. వర్కింగ్ ఉమెన్స్‌కి ఐదు రోజులు పనిదినాలు పెట్టాలి. సెలవు రోజున ఇష్టమైన వంటకాలు చేసుకోవడం, ఫంక్షన్లు, పరామర్శలు వంటి వాటికి వెళ్లి రావడం.. ఇలా తెలియకుండానే సమయం గడిచిపోతుందని శ్రీవిద్య చెప్పారు.



కూరగాయలు కోస్తూ..

● 'మహిళలకు ఆదివారం ఇంటి పనుల్లో సెలవు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఉద్యోగాలు చేసుకునే మహిళలకు విశ్రాంతి చాలా అవసరం. కానీ నా భార్య ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఎటువంటి విశ్రాంతి లేకుండా పని చేస్తుంటుంద'ని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వివరించారు.

● 'నేను ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాను. సెలవు పెడితే జీతంలో కోత. అందుకే ఒంట్లో నలతగా ఉన్నా శక్తినంతటినీ కూడగట్టుకొని పనికి వెళుతున్నాను. మా ఆయన కూలీ నాలీ పనులకు వెళుతున్నాడు. ఒక్కో రోజు ఒక్కోలా ఉంటాడు. అతనికి నచ్చితే డబ్బులు చేతిలో పెడతాడు. లేదంటే తాగేసి తందనాలు ఆడతాడు. ప్రశ్నిస్తే వీరంగం చేస్తాడు. గొడవ పడితే పిల్లలు భయపడతారు. అందుకే గుంభనంగా ఉంటూ సంసారం సాగిస్తున్నాం. ఇంటికి కావాల్సిన సరుకులన్నిటినీ బుద్ధి పుడితే సమకూరుస్తాడు. లేకుంటే నన్నే కొనుగోలు చేసుకోమని హుకుంకరిస్తాడు.' అంటూ మరో మహిళ తన కష్టాలను ఏకరువు పెట్టింది.

న్యూస్ బాక్స్

కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడంతో, ఈనెల 4వ తేదీన సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గమనించాలన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్..

విజయనగరం క్రైం: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ నెల 4న సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జీడి మామిడి పంటకు బీమా

వంగర, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగుచేసే రైతులు విధిగా జీడి మామిడి పంటకు బీమా ప్రీమియం చెల్లించాలని మండల ఉద్యాన అధికారి ఉమా మహేశ్వరి తెలిపారు. శనివారం ఆమె వంగర, బంగారువలస, అరసాడ, కొప్పరవలసలో పర్యటించి రైతులకు దీనిపై అవగాహన కల్పించారు.

దేవుదళ కేజీబీవీ తనిఖీ

రేగిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవుదళ కేజీబీవీని శనివారం ఎంఈవో-2 ఎరకయ్య తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రత చర్యలపై ఆరా తీశారు. విద్యాప్రమాణాలపై ప్రిన్స్‌పాల్ లక్ష్మీతో సమీక్షించారు. అనంతరం స్టాక్‌రూమ్‌ను తనిఖీచేశారు.

చదువుపై శ్రద్ధ పెంచుకోవాలి

రాజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులు చెడు వ్యసనా లకు బానిసలు కావొద్దని, చదువుపై శ్రద్ధ పెం చుకోవాలని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ సూచించారు. శనివారం స్థానిక పోలీ స్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎంపీపీ పాఠశాల లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక క్లాస్ తీసుకుని వారితో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ చైర్మ న్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యాపార, వాణిజ్య దుకాణాలకు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. శనివారం నగరంలోని సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రేడ్ లైసెన్సు విధింపు కార్యక్రమం ముగింపు చేసేందుకు 10 టీములు ఏర్పాటు చేశామని, ట్రేడ్ లైసెన్సులు శతశాతం అమలయ్యేలా పనిచేయాలని ఆదేశించారు. పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రామభద్రపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని విద్య, ఉపాధ్యాయ పాఠశాల రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మారుతీకాలనీ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా నేటికీ విద్యా సంబంధిత ఏ ఒక్క సమస్యపై స్పందించలేదన్నారు.

బీమా సద్వినియోగం చేసుకోవాలి

లక్కవరపుకోట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ పి.చిరంజీవి తెలిపారు. శనివారం మండలంలోని కల్లేపల్లి గ్రామంలో కొత్తవలస ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ బద్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిసున్న బీమా పథకాల గురించి వివరించారు.

దుప్పట్ల పంపిణీ

బొబ్బిలి/రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నదొరవలసలో శనివారం కార్తీకమాసం తొలి రోజు సందర్భంగా, సేవ స్ఫూర్తి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు లంక వాసు ఆధ్వర్యంలో వాసు విద్యా సంస్థల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు చేతుల మీదుగా గ్రామంలో గల 50 మంది నిరుపేదలకు దుప్పట్లు, పళ్లు వితరణ చేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

విజయనగరం క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో షీట్లు ఉన్న వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని సస్పెక్టడ్ షీట్లు ఉన్న ప్రతినిధులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగు నిర్వహించారు.

ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ ఎర్రన్న



లక్కవరపుకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, అందరి ముద్దుబిడ్డగా కింజరాపు ఎర్రన్నాయుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని ఎస్.కోట నియో జకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం ఎర్రన్నాయుడు వర్ధంతిని ఎల్.కోటలోని ఆమె నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాద్‌తో కలిసి పార్టీ నేతలు ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

ఉచిత ఇసుకకు అడ్డంకులు

- గోస్తనీ తీరంలో అధిక వసూళ్లకు పాల్పడుతున్న అక్రమార్కులు
- తీరంలోకి ప్రవేశించకుండా అడ్డంగా గోతులు తవ్వించిన వైనం
- ప్రభుత్వ ఆశయానికి విరుద్ధంగా స్థానిక నాయకులు



వేములాపల్లి గోస్తనీతీరంలో ట్రాక్టర్లు దిగకుండా స్థానిక పెద్దలు తవ్వించిన గోతులు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇసుక దొరకక సామాన్యుడు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి.. భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన లక్షలమంది పస్తులతో ఉండాల్సిన దుస్థితి. ఇసుక కొందామంటే బంగారంతో సమానంగా ధర పలకడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు భయపడి మిన్నుకుండిపోయేవారు. అదే సమయంలో అప్పటి నాయకులు మాత్రం ఇసుకను అమ్ముకుని లక్షలు సంపాదించుకున్నారు.

ఇదంతా గతం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల తరువాత పూర్తిగా ఉచిత ఇసుకను అమలు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉచిత ఇసుక తరలింపును అడ్డుకుంటే తాటతీ స్తామని హెచ్చరికలు చేశారు. అయితే ఈ హెచ్చరికలు మాత్రం మండలంలోని గోస్తనీతీరం లో ఎటువంటి ప్రభావం చూపించలేదు. ఉచిత ఇసుక కోసం మామిడిపల్లి, వేములాపల్లి, గోపాలపల్లి గ్రామాలను ఆనుకుని ఉన్న గోస్తనీతీరానికి ట్రాక్టర్లతో కొనుగోలుదారులు వెళ్లారు. కానీ అక్కడ వారి ఆశకు గండి పడింది. ఇలా వెళ్లిన వెంటనే ఇసుక ట్రాక్టర్లు తెచ్చినవారు తమ గ్రామాల వారితోనే ఇసుక ఎత్తించుకోవాలని, లోడ్‌కు రూ.వెయ్యి ఇవ్వాలని స్థానిక నాయకత్వం, పెద్దలు హుకుం జారీ చేశారు. చేసేది లేక అలాగే అన్నారు. అనంతరం గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న గుడికి అదనంగా రూ.300 ఇవ్వాలని చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. సరేనని ట్రాక్టర్‌కు రూ.1300 చెల్లించి ఇసుక తీసుకెళ్లారు. ఇలా ఆరురోజులు బాగానే గడిచాక ఈపెద్దలకు మరో ఆశ కలిగింది. లోడుకు రూ.వెయ్యి, అదనంగా గుడికి మరో రూ. 300, అంటే మొత్తం రూ. 600 చెల్లించాలని ఆదేశించ డంతో ఇసుక కొనుగోలుకు వచ్చే వారికి గుండె జారినంత పనైంది. దీనికి చాలా మంది ఒప్పుకోకపోవడంతో సదరు గ్రామాల పెద్దలు, కొందరు ప్రజాప్రతినిధులు ట్రాక్టర్ల వారిని భయపెట్టేందుకు పథకం వేశారు. గోస్తనీతీరంలోకి ఏ ఒక్క ట్రాక్టరూ ప్రవేశించకుండా పెద్దపెద్ద గోతులు తవ్వించేశారు. కొంతమంది ఈ దారుల్లో తమ ట్రాక్టర్లను అడ్డంగా పెట్టారు. దీంతో గత వారం ఇసుక సేకరణకు వచ్చి న పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తీరంలోకి వెళ్లలేక వెనక్కి మరిలాయి. కొంతమంది ట్రాక్ట ర్ యాజమానులు ప్రశ్నిస్తే ఈప్రాంతం వారితో లోడ్లు వేయించుకోవాలని, అదే విధం గా రూ.600 అదనంగా ఇవ్వాలని చెప్పడంతో వెనుదిరిగారు. ఇక్కడ ఇసుక తవ్వకా లను చూడాల్సిన అధికారులెవరూ దీనిని పట్టించుకోకపోవడంతో ఈ దందా సాగు తోంది. ఇసుక ఉచితంగా ప్రభుత్వం ఇస్తున్నప్పటికీ మండలంలోని గోస్తనీతీరంలో నాయకుల తీరు చూసి ప్రజలంతా విమర్శలు గుప్పిస్తున్నారు. గత ప్రభుత్వంలాగే వీరు కూడా దోపిడీకి దిగడం బాధాకరమని, దీనిని అరికట్టాలని కోరుతున్నారు.

పరిశీలిస్తాం..

మామిడిపల్లి, వేములాపల్లి గోస్తనీ ప్రాంతాల్లో ఇసుక సేకరణకు ట్రాక్టర్లు దిగకుండా గోతులు తీసిన విషయం ఇంకా తన దృష్టికి రాలేదు. తాను కొత్తగా విధుల్లో చేరాను. అక్కడకు వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- కృష్ణ, వీఆర్వో

రూ.10.5 కోట్లతో రోడ్ల మరమ్మతులు: మంత్రి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తక్షణమే జిల్లా వ్యాప్తంగా రూ.10.5 కోట్లతో రోడ్ల మరమ్మతు పనులు చేపడతామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గంగచోళ్ల పెంటగ్రామంలో వెంకటేశ్వర కల్యాణ మండపం ఆవరణలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.826కోట్ల రూపాయలతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రహదారుల పనులను ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చంద్రబాబు పర్యటన వాయిదా పడిందన్నారు. గజపతినగరం నుంచి మెంటాడ రహదారిలో సుమారు 6 కిలోమీటర్ల మేర రూ.37లక్షలతో ఈ రహదారి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకులు పి.వి.వి. గోపాల రాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మండలపార్టీ నాయకులు కొండపల్లి భాస్కరనాయుడు, చప్పా చంద్రశేఖర్, పెద్దింటి మోహన్, రుంకాణ అరుణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం అంటేనే అభివృద్ధి: బేబీనాయన



బొబ్బిలిలో కోటలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అంటేనే అభివృద్ధి-సంక్షేమాలకు బ్రాండ్ అని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పెద్దింటి పైడపునాయుడు ఆధ్వర్యంలో సుమారు వంద కుటుంబాల వారు శనివారం బొబ్బిలి కోటకు వచ్చి వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ బేబీనాయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పాతరేగ నుంచి పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ అవుగుడు బలరామ్ తదితరులు ఉన్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బొబ్బిలిలో శుక్రవారం మహిళలకు దీపం 2.0 పథకంలో భాగంగా, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను అందజేశారు.

మాజీ సైనికులకు పాలీక్లినిక్‌పై హర్షం

విజయనగరం రింగురోడ్డు/బొబ్బిలి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాజీ సైనికుల కోసం నూతనంగా పాలిక్లీనిక్(ఎక్స్‌సర్వీసెస్‌మెన్ కంట్రీబ్యూటరీ హాస్పటల్స్ స్కీం-ఈసీ హెచ్ఎస్) ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని జిల్లా నేతాజీ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు పెద్దింటి గుణక రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో దాదాపు 3,500 మంది మాజీ సైనికుల కుటుంబాలకు వైద్య సౌకర్యం అందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ● మాజీ సైనికులు పాలీ క్లినిక్‌లపై బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రేవళ్ల కిరణ్‌కుమార్, సంఘం సభ్యులుహర్షం వ్యక్తం చేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

గుర్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం మండల సాధారణ బడ్జెట్ సమావేశం ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సాధారణ రాబడులు, ముగింపు నిల్వల వివరాలను సభ్యులకు తెలియజేశారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు. మరికొంతమంది డమ్మీ సభ్యులు హాజరయ్యారు. అయితే సర్వసభ్య సమావేశానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రణాళికలు, తీర్మానాలు అన్నీ నిలిచిపోయాయి. మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ ప్రమీల సభ్యులకు సూచించారు. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగాలని, ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులను ఆమె కోరారు. జెడ్పీటీసీ సీర అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైసీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపీడీవో శేషుబాబు, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం



రాజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జున నారాయణ సన్నిధానంలో శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య గురుస్వామి నంది సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ప్రతి బుధవారం అంబులం పూజ నిర్వహిస్తామన్నారు.

ప్రజల ఆశల మేరకే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు

గజపతినగరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంతో మేలు జరుగుతుందనే రాష్ట్ర ప్రజల ఆశలకు అనుగుణంగా చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అన్నారు. శనివారం మండలపార్టీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మునాయుడు స్వగృహంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే సూపర్ సిక్స్ పథకాలు 90శాతం అమలు చేశారన్నారు. ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులకు సంబంధించి పురిటిపెంటలో శంకుస్థాపన జరగాల్సి ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బాబు పర్యటన వాయిదా పడిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో అన్ని రంగాలను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చంటిరాజు, మిత్తిరెడ్డి వెంకటరమణ, మాజీ సర్పంచ్ మజ్జి రామునాయుడు, మాజీ ఎంపీటీసీ లోగిశ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



పశువుల తాగునీటి నీటితొట్టెలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి

దత్తిరాజేరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాపురం సంతలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వైవీ రమణ అన్నారు. శనివారం మండలంలోని మానాపురం సంతను పరిశీలించారు. సంతను చట్టప్రకారం నిబంధనల మేరకు నిర్వహించాలన్నారు. 21వ పశు గణన కార్యక్రమం ఈ నెల 16న ప్రారంభమవుతుందన్నారు. దీనికి పాడి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సహాయసంచాలకులు చంద్రశేఖర్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలపై కేసులు



బాణసంచా దుకాణంలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ దామోదర్

విజయనగరం టౌన్/రింగురోడ్డు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఎల్ పురం సమీపంలో ఉన్న హోల్‌సేల్ బాణసంచా దుకాణాలపై లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో శనివారం కేసులు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న పలు కంపెనీల ఉత్పత్తులను పరిశీలించి, కొన్నింటిలో లోపాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో ప్యాకేజీలపై తయారీ తేదీలు, విక్రయ ధరలు లేకపోవటం, ప్రత్యేక స్టిక్కర్లు అంటించి ఉండటం, కంపెనీ చిరునామాలు లేనట్లు గుర్తించి, సీజ్ చేశారు. దీంతో మూడు దుకాణాలు, కంపెనీలపై కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారస్తులతో మాట్లాడుతూ లోపాలున్న ఉత్పత్తులు విక్రయానికి ఉంచరాదని తెలిపారు. ఈ తనిఖీల్లో టీఏ సత్యనారాయణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



శివ (ఫైల్)

బెలగాం/వీరఘట్టం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పార్వతీపురం పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే హెచ్‌సీ రత్నకుమార్ వివరాల ప్రకారం.. వీరఘట్టం మండలం తూడి గ్రామానికి చెందిన కొనిక శివ (27) మనస్తాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్యకు చేసుకున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● శివ మృతితో తూడి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెదిన కొనిన అప్పలనాయుడు, వెంకటమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వ్యవసాయ పనులు చేసుకుని పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు కొనశ ప్రసాద్ ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు శివకుమార్ డిగ్రీ వరకు చదివి ఇంటి వద్ద ఉండి తల్లిదండ్రులకు వ్యవసాయంలో సాయం చేస్తున్నాడు. కుమార్తె నీలిమకు వివాహం అయ్యింది. చిన్నకుమారుడైన శివ కుమార్‌కు సంబంధాలు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో ఈ వార్త తల్లిదండ్రులను గుండెలు పగిలేలా చేసింది. శుక్రవారం సాయంత్రం పార్వతీపురం పని ఉందని వెళ్లిన కొడుకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందారు. ఉదయం అయ్యేసరికి శివకుమార్ ఆత్మహత్య వార్త తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



అప్పలరాజు (ఫైల్)

బలిజిపేట/బెలగాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలిజిపేట మండలం నారాయ ణపురం గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పలరాజు(64) శనివారం పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రాయపూర్ పా సింజర్ రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పలరాజు కూనేరు సంతకు వెళ్లేందుకు కొత్తవలస రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వెళ్తుండ గా ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పలరాజు గ్రామంలో చిన్న టిఫిన్ సెంటర్ న డుపుతూ జీవన సాగిస్తున్నాడు. ఈ ప్రాంతంలో జరిగే వారపు సంతలకు వెళ్లి సా మాన్లు కొనుగోలు చేసి తీసుకొచ్చి నారాయణపురంలో అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం కూనేరులో జరిగే సంతకు వెళ్తున్న నేపథ్యంలో మృతిచెందాడు. మృతుడు అప్పలరాజుకు భార్య వరాహలమ్మ, కొడుకు కిషోర్, కుమార్తె స్వాతి ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయిపోయాయి. అప్పల రాజు మృతితో నారాయణపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బొబ్బిలి రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల పట్టివేత

విజయనగరం క్రైం/గజపతినగరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గజపతినగరం మండల పరిధిలోని బగ్గాం గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎస్ సత్యంను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 43 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు ఇన్‌స్పెక్టరు ఎస్ సింహాద్రి శనివారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్నట్టు ఎన్‌ఫోర్సుమెంటు అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావుకి వచ్చిన సమాచారం మేరకు దాడులు చేపటినట్టు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ప్రొహిబిషన్ ఎక్సైజ్ గజపతినగరం పోలీసు స్టేషన్‌కు పంపినట్టు తెలిపారు. ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ సీహెచ్ రాజశ్రీ, హెచ్‌సీ సుదర్శన్‌కుమార్, కానిస్టేబుల్స్ రాము, జనార్దనరావు పాల్గొన్నట్టు తెలిపారు.

● భోగాపురం మండల పరిధిలోని లింగాయవలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామసూరిని అదుపులోకి తీసుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ప్రొహిబిషన్ ఎక్సైజ్ భోగాపురం పోలీసుస్టేషన్‌కు అప్పగించినట్టు సీఐ సింహాద్రి తెలిపారు.

మారిక రోడ్డు పరిశీలన

వేపాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిపోయి గిరిజనులకు నరకం చూపిస్తున్న మారిక రోడ్డును పంచాయతీరాజ్‌శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర గ్రామంగా పేరొందిన మారిక రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ ఆందోళన చేయడంతో పాటు జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌ను కలిసి కష్టాలు చెప్పుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రహదారిని పరిశీలించి పనులు ప్రారంభించాలని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదిక అందజేయాలని ఆదేశించడంతో పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ సత్యనారాయణ శనివారం మారిక రోడ్డును పరిశీలించారు. కొత్తవలస ప్రత్యేక ఇంజినీరింగ్ విభాగం ఏఈఈ, మండల టీడీపీ నాయకులు గుమ్మడి భారతి, వల్లంపూడి శానాపతి గణేష్, మారిక గిరిజ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం పనుల అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న కాలనీవాసులు

బొబ్బిలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పారిశుధ్య కాలనీలో మురుగునీటి శుద్ధి కేంద్రం పనులను శనివారం స్థానిక కాలనీవాసుల్లో కొంతమంది మరోసారి అడ్డుకున్నారు. బొబ్బిలి పట్టణంలో మూడు చోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. ఈ పనుల కోసం టెండర్లు కూడా ఖరారయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక పారిశుధ్య కాలనీ వెనుక భాగాన గల సుమారు ఎకరా ప్రభుత్వ భూమిలో ఈ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి తుప్పలు, డొంకల తొలగింపు, నేల చదును చేయడం వంటి పనులను యంత్రాలతో చేపట్టారు. ఈ పనులను కాలనీ వాసులు అడ్డుకున్నారు. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు సోమేశ్వరరావు తదితరులు వచ్చి స్థానికులతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో సంప్రదింపులు జరిగాయని, మురుగునీటి శుద్ధి కేంద్రంతో పాటు స్థానికుల కోసం ఇళ్ల నిర్మాణానికి ఈ స్థలం సరిపోతుందని కొంతమంది నాయకులు ఇందుకు అంగీకరించిన విషయాన్ని వారికి తెలిపారు. ఈ సమాచారమేదీ తమకు తెలియదని వారు వాదించారు. జి-ప్లస్ ప్రాతిపదికన ఇళ్లను మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే బేబీనాయన హామీ ఇచ్చారని వారు స్థానికులకు వివరించారు. ఈ అంశాలపై మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కమిషనరుతో మాట్లాడాలని సూచించారు. దీనికి వారు సమ్మతించారు.

'అపార్' కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

పూర్తిచేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తుండడంతో ఎంఈవోలు, టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వారికి ఏం చేయాలో తెలియడం లేదు.

బర్త్ సర్టిఫికెట్‌కు తిప్పలు

మా పిల్లల ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ సరిచేయాలని స్టడీ సర్టిఫికెట్ ఇచ్చి ఉపాధ్యాయులు చేతులు దులుపుకొన్నారు. అయితే ఆధార్‌లో తప్పులను సరిచేయాలంటే తల ప్రాణం తోకకు వస్తుంది. జనన ధ్రువీకరణ పత్రం చేస్తేనే మార్చడం అవుతుందని ఆధార్ సెంటర్ వాళ్లు చెబుతున్నారు. అటు పొలం పనులు చేసుకోలేక.. ఇటు బర్త్ సర్టిఫికెట్ల కోసం తిరగలేక అవస్థలు పడుతున్నాం.

- బిడ్డిక రమేష్, రైతు కూలి, మూలగూడ

ఆధార్ మార్చాలి

నా టెన్త్ మార్క్స్ మెమో, ఆధార్ కార్డులో డేటాఫ్ బర్త్‌కు పొంతన లేదు. 18 ఏళ్లు పూర్తయితేనే మార్క్స్ మెమోతో ఆధార్‌లో పుట్టిన తేదీ మార్చొచ్చని సచివాలయ డిజిటల్ ఆపరేటర్లు చెబు తున్నారు. అయితే డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ లేకపోవడంతో అపార్‌లో నమోదుకు అవకాశం లేదంటున్నారు. కొత్త నిబంధనలతో ఇబ్బందులు తప్పడం లేదు.

- నిమ్మల హైమావతి, ఇంటర్ ప్రథమ సంతవ్సర విద్యార్థిని

సరిచేస్తున్నాం..

యూడైస్ జాబితాలో విద్యార్థి ఇంటి పేరు, తండ్రి పేరు, అడ్మిన్ రిజిస్టర్ ప్రకారం వివరాలు సరిచేస్తున్నాం. మండలంలో 6,333 మంది విద్యార్థులు ఉండగా 2,038 మంది ఏపీఏఆర్ఐడీలో నమోదయ్యారు.

- బి.శ్రీనివాసరావు, ఎంఈవో, భామిని

పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించండి

● డిప్యూటీ డీఈవో నారాయుడు

సీతంపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు సూచించారు. ఐటీడీఏ పరిధిలోని చినబగ్గ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. మెనూ అమలు, విద్యార్థుల ఆరోగ్యం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు పీఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

పోలమాంబ ఆలయ హుండీల లెక్కింపు

మక్కువ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి హుండీల లెక్కింపును శనివారం నిర్వహించారు. చదురు గుడి హుండీ ద్వారా లక్షా పది వేల 28 రూపాయలు, వనం గుడి హుండీ ద్వారా రూ.97,888 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. నాలుగు నెలల కాలానికి ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాలూరు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి టి.రమేష్, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, సూర్యయాదవ్, పోలీస్, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రన్న ఆశయాలు కొనసాగించాలి

పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయాలను కొనసాగించాలని టీడీపీ నాయకుడు గుమ్మడి సింహాద్రి అన్నారు. శనివారం ఎర్రన్నాయుడి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పెదకాపు వీధిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు గుమ్మడి ఉమామహేశ్వరరావు, మంత్రి దుర్గారావు, దుప్పాడ నారాయణరావు, శాసపు చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

సీతంపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన వైటీసీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్తంగా ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు పీవో చెప్పారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకెండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తామన్నారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, కెమిస్ట్రీ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు 9121999654, 7993011695 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పింఛన్‌దారుల నిరసన

గరుగుబిల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బురదవెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు పింఛన్‌దారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం నిరసన తెలిపారు. సర్పంచ్ బొత్స లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో మొదటి విడతలో 34 మందికి, రెండో దఫా మరో 98 మందికి నోటీసులు కూడా జారీ చేయకుండా పింఛన్లను నిలుపుదల చేశారని చెప్పారు. ఎంపీడీవో వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరీక్షించినప్పటికీ ఎంపీడీవో రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గరుగుబిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ ఎం.హరికృష్ణ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో గోకులాలు, సోప్ పిట్లు, వర్షపు నీరు ఇంకే గుంతలతో పాటు పలు రకాల పనులు మంజూరయ్యాయన్నారు. నవంబరు 15లోగా పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

6 లక్షల దోమతెరల మంజూరు

ఒడిశా

రాయగడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దోమతెరలు వాడి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందాలని కలెక్టర్ పారుల్ పట్వారి అన్నారు. స్థానిక సీఆర్‌పీఎఫ్ నాలగవ బెటాలియన్ కార్యాల యంలో ఆమె శనివారం దోమతెరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయగడ జిల్లాను మలేరియా రహిత జిల్లాగా చేయాలన్నారు. జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గిరిజన ప్రాంతాలకు 6లక్షల 37వేల 948 దోమతెరలు మంజూరు అయినట్టు తెలిపారు. అనంతరం కూంబింగ్ నిర్వహించే జవాన్లకు దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి ముఖ్యవైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్, డాక్టర్ మమతా చౌదురి, సీఆర్పీఎఫ్ కమండెంట్ ప్రభాకర్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ప్రభుత్వ వైద్యుడి అరెస్టు

రాయగడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగ్‌రోడ్డులో లయన్స్‌క్లబ్ సమీపంలో ఉన్న పీహెచ్‌సీలోని చోరీ కేసుకు సంబంధించి రోహిత్ కుందు అనే ప్రభుత్వ వైద్యునితో పాటు మరో ఇద్దరు సాంకేతిక సిబ్బంది అమూల్య సంపత, దేబాశిస్ గౌరడియాలను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఠాణా ఐఐసీ కమలాకాంత్ కహర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. యూపీహెచ్‌సీలో అక్టోబరు 29న చోరీ జరిగిందని ఇందులో ఆసుపత్రికి సంబంధించి ఓ ల్యాప్‌టాప్, సీసీ టీవీ ఫుటేజీ హార్డ్‌డిస్క్, రిజిస్టర్‌తో పాటు పలు దస్త్రాలు మాయమైనట్లు వైద్యుడు సంగ్రామ్ కిషోర్ నిమల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి ఇందుకు సంబంధించి పీహెచ్‌సీ మాజీ వైద్యుడు రోహిత్‌కుందు, మరో ఇద్దరు సాంకేతిక సిబ్బందిని అరెస్టు చేశారు. కుందుపై గతంలో పలు ఆరోపణలు రావడంతో సీడీఎంవో విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి సంబంధించిన సామగ్రి రికార్డులు పోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఈ నిర్మాణాన్ని పూర్తిచేయరూ..

● అర్ధాంతరంగా నిలిచిన సీహెచ్‌సీ భవనం

● పాత భవనంలో ఇబ్బందులు పడుతున్న రోగులు



సగంలో నిలిచిపోయిన భద్రగిరి ఆసుపత్రి భవన నిర్మాణం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మూడు కోట్ల రూపాయల వ్యయంతో నాలుగుగేళ్ల కిందట ఈ భవనానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచే ఈ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లులు చెల్లించనందున పనులను పూర్తిగా నిలిపివేసి, నిర్మాణ సామగ్రిని కాంట్రాక్టర్ పట్టుకుపోయాడు. గత ఆరు నెలలుగా ఎటువంటి నిర్మాణ పనులు జరగడం లేదు. ప్రస్తుత ఆస్పత్రి భవనం చిన్నది కావడంతో ఒక మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులను ఉంచాల్సిన పరిస్థితి వస్తోంది. అలాగే ఈ ఆస్పత్రికి వచ్చే రోగులకు తగిన బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిన ఆస్పత్రి అదనపు గదుల నిర్మాణాలను పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేయండి

కురుపాం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)చైర్మన్ అనిమిని రవినాయుడుకు లేఖ రాశారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం ఉత్తరాంధ్ర పర్యటనకు విశాఖ వచ్చారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. అర్ధాంతరంగా నిలిచిన గుమ్మలక్ష్మీపురం మినీ స్టేడియం విషయాన్ని తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఇచ్చిన లేఖను ఆయనకు అందజేశారు.

బెల్ట్ షాపుల నిర్వహణ చట్టరీత్యా నేరం

సీతానగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ చట్టరీత్యా నేరమని, వీటిని అరికట్టేందుకు సచివాలయ మహిళా పోలీసులు కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. శనివారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని చెప్పారు. ఈ మార్గదర్శకాలను అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎస్ఐ షరీఫ్, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం

గరుగుబిల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమాన్ని అందించే ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాధ్యమని టీడీపీ అరకు పార్లమెంటరీ బీసీ విభాగం చైర్మన్ బూరాడ రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలోనే చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. ఆదరణ పథకంతో బీసీలను ఆదుకునేందుకు జిల్లాల వారీగా సమాచార సేకరణ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఉన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి

పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొట్టమంగళాపురం గ్రామం దరిలో ఉన్న నాగావళి నదిలో నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఇసుక తవ్వకలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందించారు. రమణారావు మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద బ్రిడ్జిలు, తాగునీటి పథకాలు వంటి నిర్మాణాలకు 50 మీటర్లు పరిధి దాటిన తర్వాత మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని కలెక్టర్ ప్రకటించినప్పటికీ దానికి విరుద్ధంగా వంద మీటర్లు, 200 మీటర్లు పరిధిల ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఈ నిరసనలో దూసి దుర్గారావు, కాద రాము, మజ్జి వీరంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



రిలే దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బెలగాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన నిధులు విధుల చేయకుండా పెండింగ్‌లో ఉంచిందన్నారు. దీనివల్ల విద్యార్థులు వారి సర్టిఫికెట్స్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన చెందారు. జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సింహాచలం, డేవిడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ విధానాలు విడనాడాలి

పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం కొంతమంది అధికారులు టైర్లు, స్ప్రింగ్ ప్లేట్లు, గ్లాస్ డ్యామేజ్‌లు, బస్సు డ్యామేజీలు, టిమ్స్ డ్యామేజీలపై రివకరీ చేస్తున్నారని ఈయూ జోన్ అధ్యక్షుడు శుభకరరావు, జోన్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమస్యలపై ఈడీకు లేఖ అందించామన్నారు. ఉద్యోగులు చార్జిషీట్లు ఇచ్చి వారి జీతాల నుంచి రికవరీలు చేయడం అన్యాయమన్నారు. విధి నిర్వహణలో జరుగుతున్న ఈ డ్యామేజీలకు కూడా వేలాది రూపాయలు రికవరీ చేస్తుండడం శోచనీయమన్నారు. ఇటీవల కాలంలో కొన్ని నిర్ణయాలు మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా తీసుకోవడం తగదన్నారు. ఈ విధానాలపై ఈ నెల 6న విజయవాడలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించనున్నట్టు వారు పేర్కొన్నారు.

ఉద్యోగుల భద్రతే ధ్యేయం

● ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భద్రతే ధ్యేయమని ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్ఎంయూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, పాల్గొన్నారు. అనంతరం యూనియన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. పాలకొండ డిపోలో ఈయూ, వైఎస్ఆర్ సంఘాల నుంచి ఎన్ఎంయూ అసోసియేషన్‌లో చేరిన 49 మంది ఉద్యోగులను ఆహ్వానించారు. పాలకొండ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఆహ్వానించామని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్ఎంయూ నాయకులు నరసింగరావు, ప్రదీప్‌కుమార్, సూర్యరాములు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: సమాదులకు పూజలు చేస్తున్న క్రైస్తవులు



జియ్యమ్మవలసలో సమాదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ కిశోర్‌రాజు

భక్తిశ్రద్ధలతో సకల ఆత్మల పండగ

జియ్యమ్మవలస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో సకల ఆత్మల పండగ ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పండగలో అనేకమంది క్రైస్తవులు పాల్గొన్నారు. చనిపోయిన తమ బంధువుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని కోరుతూ వారి సమాదుల వద్ద ప్రార్థనలు చేశారు.

● సాలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మేరీనగర్ విచారణలో సకల మృతుల స్మరణ దినం సందర్భంగా శనివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తమ బంధువుల సమాధులను అందంగా అలంకరించి, పూజలు చేశారు.

డీఈసీసీలో వైద్య శిబిరం

బెలగాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి బాలల సత్వర చికిత్స కేంద్రం (డీఈసీసీ)లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో విజయపార్వతి సందర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విజయవాడ దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించి, వినికిడి సమస్య ఉన్నవారికి కావలసిన పరికరాలను ఉచితంగా అందజేస్తున్నారని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ శిబిరంలో డీఈసీసీ పిల్లల వైద్య నిపుణులు భరత్ చంద్ర, కోటేశ్వరరావు తదితరలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 18 ఏళ్ల లోపు 37 మందికి, 18 ఏళ్ల పైబడిన 74 మందికి వైద్య పరీక్షలు చేయగా 27 మందికి లోపాలు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. వారికి త్వరలో వినికిడి యంత్రాలను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్బీఎస్‌కే డాక్టర్ రఘుకుమార్, ప్రోగ్రాం అధికారి డా.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో పింఛన్ అందజేత



సాలూరు రూరల్: విజయనగరం ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న దృశ్యం



పాలకొండ: విశాఖలో పింఛన్ అందిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రంలోని మహారాజ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాలూరు మండల వాసికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి శనివారం పింఛన్ అందజేశారు. సాలూరు మండలం కొత్తవలస పంచాయతీ దాగరవలసకు చెందిన గిరిజనుడు నెమలిపురి తామయ్య అనారోగ్యంతో విజయనగరం మహారాజ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎర్రన్నాయుడు అక్కడకికి వెళ్ల పింఛన్ నగదు అందించారు. సాలూరు మండలంలో 8346 పింఛన్లుకు గాను 8276 పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రమాదేవి చెప్పారు. ● పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన పోరెడ్డి దాలినాయుడు క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖలో ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే తుమరాడ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ గొర్లె జగదీష్, డిజిటల్ అసిస్టెంట్ వన్నల బాలరాజు శనివారం విశాఖ వెళ్లి దాలినాయుడుకు పింఛన్ డబ్బులు అందించారు. దీంతో జగదీష్, బాలరాజును పలువురు అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గంగరాజు

నెల్లిమర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నవంబరు 14 నుంచి జరుగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అలుగోలు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి నక్కెల్ల గంగరాజు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం జీఎస్ కాంతారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో గంగరాజు పాల్గొని మంచి ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. గంగరాజును గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ సారికి వైకుంఠంనాయుడు, సర్పంచ్ అలుగోలు బంగారమ్మ అభినందించారు. అలాగే ఫిజికల్ డైరెక్టర్లు సూర్యారావు, షరీఫ్‌లను ప్రశంసించారు.

న్యూస్ బాక్స్

పిచ్చికుక్క స్వైర విహారం

పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలకొండ డివిజన్ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, నీలమ్మకాలనీ, ఆంజనేయకాలనీ సమీపంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సుమారు 18 మందిని గాయపరిచింది. నగర పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా మోహన్

పాలకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా బత్తిన మోహన్‌ను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండో సారి ఈ అవకాశం పొందిన బత్తిన మోహన్‌రావు.. వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రారంభోత్సవాలు వాయిదా

వీరఘట్టం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా మండలంలోని పలు ప్రారంభోత్సవాలు వాయిదా పడ్డాయి. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా తలవరం జంక్షన్ నుంచి తెట్టంగి జంక్షన్ వరకు ఉన్న సీఎస్‌పీ రహదారి, కిమ్మి నుంచి రుషింగి వెళ్లే తారురోడ్డు మరమ్మతులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం ప్రారంభించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ కారణంగా ఈ ప్రారంభాలను వాయిదా వేశారు.

వేతనాలు చెల్లించండి

సీతంపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లుగా పని చేస్తున్న తమకు నాలుగు నెలలుగా వేతనాలు లేవ ని సుధాకర్, అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణలో జీతాలు చెల్లించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు.

నేడు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

సీతానగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 3న జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభకు ఉపాధ్యాయులంతా తరలి రావాలని మండల శాఖ ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు కోరారు. శనివారం సీతానగరంలో పోస్టర్లను ఆవిష్కరిం చారు. మండలశాఖ అధ్యక్షుడు పల్లి శ్రీనివాస రావు, జిల్లా, మండల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఈనెల 4వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల కు మెళియాపుట్టి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందన్నారు. కార్యక్రమానికి టెక్కలి డివిజన్‌లోని అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని పీవో ఆదేశించారు.

నీటి అక్రమ రవాణాను అరికట్టాలి

భోగాపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): చేపలకంచేరులో ట్యాంకర్లతో అక్రమంగా తాగునీరు రావాణా చేస్తూ హేచరీలకు విక్రయిస్తున్నారని, దీన్ని అరికట్టాలని ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శనివా రం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహ సీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు.

గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించండి

సాలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలైన కరడవలస, జిల్లేడువలస, పడాలవలసలకు రోడ్లు నిర్మించాలని సీపీఎం నాయకుడు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లేడువలసలో సీపీఎం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

సాలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పట్టణంలో అనూహ్య స్పందన లభిస్తుందని ఆ పార్టీ సాలూరు పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు(చిట్టి) అన్నారు. పట్టణంలోని 25వ వార్డు బంగారమ్మపేటలో శనివారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.